కొత్తగూడెం త్రివేణి పాఠశాలలో..

జూలూరుపాడు జడ్పీఎస్ఎస్‌లో..

పాల్వంచ కేటీపీఎస్ డీఏవీ పాఠశాలలో..

అశ్వారావుపేట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో..

ములకలపల్లి శిశుమందిర్‌లో..

చంద్రుగొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో..

విద్యాసంస్థల్లో ముందస్తు
సంక్రాంతి వేడుకలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి విశిష్టత తెలియజెప్పే విధంగా సంప్రదాయ వేషధారణలో విద్యార్థులు అలరించారు. హరిదాసు వేషధారణలు, బోగి మంటలు, ముగ్గులు, గొబ్బెమ్మలు వంటివి ఆకట్టుకున్నాయి. కొత్తగూడెం త్రివేణి పాఠశాల, పాల్వంచ కేటీపీఎస్ డీఏవీ పాఠశాల, జూలూరుపాడు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు సందడి చేశారు. సారపాకలోని వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సారపాక బ్రిలియంట్ విద్యాసంస్థల ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ములకలపల్లి మండలం శిశుమందిర్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ కిన్నెరసాని ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు జరిగాయి. భద్రాచలం పట్టణంలోని గిరిజన బీఈడీ కళాశాలలో ముగ్గుల పోటీలు జరిగాయి. బహుమతులను సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ అధినేత దమయంతి బహూకరించారు. చంద్రుగొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో ముగ్గుల పోటీలు జరిగాయి. బహుమతులను హెచ్ఎం కృష్ణకుమారి అందించారు. ఇల్లెందు పట్టణం ఇందిరా నగర్‌లోని మార్గదర్శిని పాఠశాలలో ముగ్గుల పోటీలు జరిగాయి.

– నమస్తే నెట్‌వర్క్

ఇల్లెందు ఇందిరానగర్‌లోని మార్గదర్శిని పాఠశాలలో..

మణుగూరులో బోగి మంటలు..

సారపాక బ్రిలియంట్ విద్యాసంస్థల ఆవరణలో..

రాములోరికి నిత్య కల్యాణం

భద్రాచలం/ పర్ణశాల, జనవరి 11: భద్రాచలం సీతారామచంద్రస్వామికి అర్చకులు గురువారం బేడా మండపంలో నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణ దంపతులకు ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

రామయ్యను దర్శించుకున్న ప్రతీక్‌జైన్

రామయ్యను దర్శించుకున్న పీవో

భద్రాచలం సీతారామచంద్రస్వామిని ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, ఆయన కుటుంబీకులు దర్శించుకున్నారు. అంతరాలయంలోని మూలవరుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోగల ఉపాలయాలను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు వేదాశీర్వచనం, ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. పర్ణశాల రామయ్యను ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, కుటుంబీకులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వడ్డే ఓబన్న జీవితం స్ఫూర్తిదాయకం: అదనపు కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 11 (నమస్తే తెలంగాణ): వడ్డే ఓబన్న జీవితం స్ఫూర్తిదాయకమని అదనపు కలెక్టర్ రాంబాబు పేర్కొన్నారు. ఐడీవోసీలోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వడ్డే ఓబన్న జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఓబన్న పాత్ర అనిర్వచనీయమైనదని అన్నారు. తొలితరం స్వాతంత్ర్య సమర యోధుడైన వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం సంతోషమని అన్నారు. అధికారులు, జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి ఇందిర, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్

ఎఫ్ఆర్‌వో హత్యాప్రదేశంలో ప్లాంటేషన్

చంద్రుగొండ, జనవరి 11: చంద్రుగొండ ఎఫ్ఆర్‌వో చలమల శ్రీనివాసరావు గత ఏడాది గొత్తికోయల చేతిలో హత్యకు గురయ్యారు. హత్య జరిగిన ప్రదేశంలో ఆయన జ్ఞాపకంగా ప్లాంటేషన్ చేయాలని అధికారులను అటవీశాఖ విజిలెన్స్ పీసీసీఎఫ్ ఇలు సిగ్నేర్ ఆదేశించారు. ఆయన ఆధ్వర్యంలోని విజిలెన్స్ బృందం గురువారం బెండాలపాడు శివారులోని ఎర్రగబోడు అటవీ ప్రాంతంలో ఎఫ్ఆర్‌వో హత్యకు గురైన ప్రదేశాన్ని పరిశీలించింది. భద్రాద్రి సర్కిల్ సీపీఎఫ్ భీమానాయక్, డీఎఫ్‌వో కృష్ణాగౌడ్, ఎఫ్డీవో కోటేశ్వరరావు, ఎఫ్ఆర్‌వో ఎల్లయ్య, ఎస్సై మాచినేని రవి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోరం కనకయ్యకు సన్మానం

టేకులపల్లి, జనవరి 11: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను మండలంలోని కోయగూడెంలోగల స్వగృహంలో గురువారం అక్కడి గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. అమర్‌సింగ్ (హెచ్ఎం), భూక్యా సైదులు, గుగులోత్ హరిలాల్, భూక్యా కస్నానాయక్, ఈ.ముత్తయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోరంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జిల్లా గ్రంథాలయ సంస్థల పర్సన్ ఇన్‌చార్జిగా అదనపు కలెక్టర్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జనవరి 11: జిల్లా గ్రంథాలయ సంస్థల పర్సన్ ఇన్‌చార్జిగా అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు. జిల్లా గ్రంథాలయాల వ్యవహారాలు, విధుల నిర్వహణను ఆయన పర్యవేక్షించనున్నారు.

ట్రాఫిక్ చలానాల చెల్లింపునకు గడువు పొడిగింపు

రామవరం, జనవరి 11: ట్రాఫిక్ చలానాల చెల్లింపునకు ప్రభుత్వం ఈ నెల 31 వరకూ గడువు పొడిగించినందున పెండింగ్ చలాన్లు ఉన్న వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం టూటౌన్ సీఐ టీ.రమేష్‌కుమార్ తెలిపారు.

సింగరేణి ఉద్యోగులకు ప్రమోషన్ల పత్రాల అందజేత

రామవరం, జనవరి 11: సింగరేణి కొత్తగూడెం ఏరియాలో అండర్ గ్రౌండ్‌లో ఏడేళ్లుగా పనిచేస్తున్న అర్హత ఉన్న ఉద్యోగులకు సింగరేణి యాజమాన్యం ప్రమోషన్లు కల్పించింది. ఈ మేరకు ఎస్ఎల్‌సీ, ఎస్ఎల్ఐ కింద ఉద్యోగోన్నతి పత్రాలను ఏరియా జీఎం శాలెంరాజు ఆయా ఉద్యోగులకు గురువారం అందజేశారు.

ఎయిడ్స్‌పై సదస్సు

దుమ్ముగూడెం, జనవరి 11: ఎయిడ్స్, ఇతరత్రా సుఖ వ్యాధులపై అవగాహన సదస్సును మండలంలోని తూరుబాక పంచాయతీ కార్యాలయంలో గురువారం వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్స్ సూపర్‌వైజర్ టి.మధుబాబు, లింక్ వర్కర్ బి.జరీనా నిర్వహించారు. సర్పంచ్ భూక్యా చందు, ఏఎన్ఎంలు నాగమణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యేక నిధులు

నిధుల మంజూరు కోసం ప్రతిపాదన పంపాలి : కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 11 (నమస్తే తెలంగాణ): ఆకాంక్షిత (యాస్పిరేషనల్) జిల్లాల్లో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు కోసం ప్రతిపాదన పంపాలని నీతి అయోగ్ మిషన్ డైరెక్టర్ రాధ అన్నారు. ఢిల్లీ నుంచి ఆకాంక్షిత జిల్లాల కలెక్టర్లతో గురువారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ... యాస్పిరేషన్ డిస్ట్రిక్ట్ బ్లాక్స్ ప్రోగ్రాం కింద జిల్లాకు రూ.4 కోట్లు మంజూరు చేశారని, ఆ నిధుల వినియోగంపై ద్రవ్య వినిమయ ధృవీకరణ పత్రాలు కూడా పంపామని అన్నారు. మిగిలిన మూడు కోట్ల నిధులు మంజూరుకు ప్రతిపాదనలు చెప్పారు. ఈ సమావేశంలో సీపీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

పట్టభద్రుల ఉప ఎన్నికకు ఓటరుగా నమోదుకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గంకు జరగనున్న ఉప ఎన్నికకు సంబంధించి ఓటరు నమోదుకు పట్టభద్రులు దరఖాస్తు చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. గురువారం పట్టభద్రుల ఓటుహక్కు నమోదుపై ఐడీవోసీ కార్యాలయంలో ఆర్డీవో, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్‌వో రవీంద్రనాథ్, తహసీల్దార్లు,ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

బూర్గంపహాడ్, జనవరి 11: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను ఖచ్చితంగా చేసి చేస్తామని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ తిరుమలాచారి ఆధ్వర్యంలో 46 మందికి ఆయన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. గోదావరి వరద ముంపు గ్రామాల్లో బాధితులకు శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాయం

భూ బాధితుల సమస్యల పరిష్కారానికి కృషి

సారపాక, జనవరి 11: మండల పరిధిలోని ఇరవెండి గ్రామంలో భూ బాధితుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం భూ బాధితులు, ఐటీసీ అధికారులకు మధ్య జరుగుతున్న పైపులైను పనుల నిలిపివేతకు సంబంధించి ఆరా తీసి భూ బాధితులను కలుసుకున్నారు. భూ బాధితులకు రావాల్సిన నష్టపరిహారం, ఐటీసీలో ఉద్యోగాల విషయమై మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఎల్ఈడీ స్క్రీన్ ప్రారంభించిన ఎమ్మెల్యే

సారపాక, జనవరి 11: మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ డిజిటల్ స్క్రీన్‌ను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కైపు లక్ష్మినారాయణరెడ్డి, కైపు శ్రీనివాసరెడ్డి, బట్టా విజయ్‌గాంధీ, బాదం రమేష్‌రెడ్డి, దుగ్గెంపూడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణల తొలగింపు

పినపాక, జనవరి 11: మండల కేంద్రంలోని ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్డు ఆర్ అండ్‌బీ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను గురువారం అధికారులు తొలగించారు. నాలుగు రోజుల ముందే ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసిన పంచాయతీ అధికారులు జేసీబీ సహాయంలో ప్రధాన రహదారికి ఇరువైపులా 20 అడుగుల లోపు వేసుకున్న షాపులు, బడ్డీలను ఎంబీవో వెంకటేశ్వరరావు సూచనల ప్రకారం ఆక్రమణలను తొలగిస్తున్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

చంద్రుగొండ, జనవరి 11: సంక్రాంతికి కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రహమాన్ హెచ్చరించారు. ఆయన గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. కోడి పందేలు, పేకాట స్థావరాల వివరాలను సేకరిస్తున్నామన్నారు. పేకాట, కోడి పందేలపై ప్రజలు కూడా సమాచారం ఇవ్వాలని కోరారు. ఇలా సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. జూలూరుపాడు సీఐ శ్రీనివాస్, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, జూలూరుపాడు ఎస్సైలు షాహీన్, మాచినేని రవి, పురషోత్తం పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను నిరోధించాలి

ములకలపల్లి, జనవరి 11: మానవ అక్రమ రవాణాను నిరోధించడం అందరి బాధ్యతని ఐసీడీఎస్ సీడీపీవో జ్యోతి అన్నారు. మానవ అక్రమ రవాణాపై మండలంలోని జగన్నాథపురం రైతు వేదికలో అవగాహన సమావేశానని గురువారం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ నిర్వహించింది. సీడీపీవో మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా, నిరోధం తదితరాంశాలను వివరించారు. సంస్థ ప్రతినిధి ప్రమీల మాట్లాడుతూ.. అనుమానాస్పద వ్యక్తుల నుంచి మెసేజ్, కాల్స్ వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలని, 1930 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని అన్నారు.

టీబీజీకేఎస్‌తోనే కార్మికుల సంక్షేమం సాధ్యం

రామవరం, జనవరి 11: కార్మికుల సంక్షేమం, హక్కుల సాధన తమ సంఘంతోనే సాధ్యమని టీబీజీకేఎస్ రీజినల్ సెక్రటరీ కూసన వీరభద్రం స్పష్టం చేశారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ జయశంకర్ గ్రౌండ్‌ను గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. సుమారు రూ.6 లక్షలతో ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌ను అభివృద్ధి పర్చిన ఘనత తమకే దక్కుతుందని అన్నారు. మైదానంలో మరుగుదొడ్లు, స్టేజీ నిర్మాణం కోసం సివిల్ అధికారులు త్వరలోనే టెండర్లు పిలవనున్నారని అన్నారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ట్రెజరర్ రాసపల్లి రాజేంద్రప్రసాద్, నిమ్మల సాగర్, బాచీ, రుద్రంపూర్ సర్పంచ్ గుమ్మడి సాగర్, బాచీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇగ్నైట్‌ఫెస్ట్‌లో దమ్మపేట ప్రతిభ

దమ్మపేట రూరల్, జనవరి 11 : భద్రాచలంలో ఈ నెల 8,9,10 తేదీల్లో జరిగిన గిరిజన గురుకులాల రాష్ట్రస్థాయి ఫెస్ట్‌లో దమ్మపేట గిరిజన గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నారు. ఫ్యాన్సీ డ్రస్ పోటీలో సంతోశ్, సాత్విక్, స్పాట్ డ్రాయింగ్‌లో అఖిల్, తెలుగు హ్యాండ్ రైటింగ్‌లో హేమంత్, బెస్ట్ అవుట్ ఆఫ్ వెస్ట్‌లో భరత్, యూత్ పార్లమెంట్‌లో రామ్‌చరణ్, విష్ణువర్ధన్‌లు ప్రతిభ చాటి మెమొంటోలు అందుకున్నారు. వీరిని ప్రిన్సిపాల్ జానునాయక్, వైస్ ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్, బాలాజీ, ఉపాధ్యాయులు అభినందించారు. 11ఎంఎన్‌జీ03 : బొమ్మలకొలువు కార్యక్రమంలో మాట్లాడుతున్న జీఎం రామచందర్

మన సంస్కృతి, సంప్రదాయాలు విశిష్టమైనవి

మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్

మణుగూరుటౌన్, జనవరి 11: మనం ఏ ప్రాంతంలో ఉన్నా, మన జీవితాలు ఎంత బిజీగా ఉన్నా.. మన సంస్కృతి సంప్రదాయాలను గౌరవించడం మన బాధ్యత అని ఏరియా జీఎం దుర్గం రామచందర్ అన్నారు. ఆయన గురువారం ఏరియాలోని ఇల్లెందు క్లబ్ నందు లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బొమ్మలకొలువు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బొమ్మల కొలువును ఏర్పాటు చేసిన మణుగూరు ఏరియా లేడీస్‌క్లబ్ సభ్యులును అభినందించారు. అనంతరం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో, సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన మహిళలకు బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో మధురవాణి షాలెంరాజు, నిమ్మి జాన్ ఆనంద్, దుర్గం సుమ రామచందర్, బి.కవిత శ్రీనివాసాచారి, అంజలి, సునీత, సర్సిరెడ్డి, వీసం కృష్ణయ్య, లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాసాచారి, వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు సకాలంలో పరిష్కరించాలి

డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్

మణుగూరుటౌన్, జనవరి 11: ఉద్యోగుల సమస్యలను సకాలంలో పరిష్కరించి సహకరించాలని ఏరియా డీజీఎం (పర్సనల్) సలగల రమేశ్ అన్నారు. గురువారం స్థానిక జీఎం కార్యాలయంలో పర్సనల్ విభాగం నందు ఆయన సంక్షేమ అధికారులు, పీవోఏలు, ఆయా డిపార్టుమెంట్ల మినిస్ట్రీయల్ స్టాఫ్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిర్ణీత కాలవ్యవధిలో ఉద్యోగులకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం తగు సూచనలు చేశారు. సమావేశంలో సీనియర్ పీవోలు ఎస్.శ్రీనివాస్, మదార్, నరేశ్, వీరభద్రం, మధు, ఎం.నర్సింహారావు, గురుప్రసాద్, ఇతర మినిస్ట్రీయల్‌స్టాఫ్ పాల్గొన్నారు.

పీవీకే గనిలో జనరల్ మజ్దూర్లుగా పనిచేసేందుకు దరఖాస్తులకు ఆహ్వానం

రామవరం, జనవరి 11: కుటుంబ సభ్యులకు దూరంగా వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి.. కొత్తగూడెం ఏరియాలోని పీవీకే 5 గనిలో జనరల్ మజ్దూర్లుగా పనిచేసేదుంకు అవకాశం ఇస్తున్నట్లు సింగరేణి యాజమాన్యం తెలిపింది. ఆసక్తిగల వారు ఇందుకోసం ఈ నెల 22లోగా దరఖాస్తులు చేసుకోవాలని జీఎం పర్సనల్ హనుమంతరావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. మణుగూరు, రామగుండం 1, రామగుండం 2, ఆంధ్రియాలా, భూపాలపల్లి, మండదమర్రి, శ్రీరాంపూర్ ఏరియాల్లో పనిచేస్తున్న జనరల్ మస్దూర్లు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు.

చైనా మాంజా విక్రయిస్తే చర్యలు

పినపాక, జనవరి 11: గాలిపటాలను ఎగురవేసేందుకు చైనా మాంజా దారాలను విక్రయించవద్దని ఏడూళ్లబయ్యారం ఫారెస్ట్ రేంజి అధికారి తేజస్విని అన్నారు. ఆమె గురువారం ఫారెస్ట్ సిబ్బందితో కలిసి ఏడూళ్లబయ్యారం, జానంపేట గ్రామాల్లో పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం గాజుపూత పూసిన చైనా మాంజా దారాల విక్రయాలను నిషేధించిందని, దుకాణదారులు నిబంధనలు అతిక్రమించి చైనా మాంజా దారాలను తీసుకువస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ట్రాక్టర్ పట్టివేత

సారపాక, జనవరి 11: ఓవర్ లోడుతో వెళ్తున్న జామాయిల్ కర్ర(పుల్ల)ట్రాక్టర్‌ను ఎంవీఐ తిరుపతి గురువారం పట్టుకున్నారు. ఇప్పటికే పలుమార్లు ఓవర్ లోడుతో వెళ్లే పుల్ల ట్రాక్టర్లను ఎంవీఐ పట్టుకుని జరిమానా సైతం విధించారు. తాజాగా మరో పుల్ల ట్రాక్టర్‌ను సారపాక ప్రాంతంలో పట్టుకుని సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

15కిలోల గంజాయి స్వాధీనం

భద్రాచలం, జనవరి 11: భద్రాచలం పట్టణంలో 15 కేజీల ఎండు గంజాయి పట్టుబడింది. ఎక్సైజ్ సీఐ రహీమున్నీసా బేగం తెలిపిన వివరాలు... మోటర్ సైకిల్‌పై ఎండు గంజాయి తరలిస్తున్నట్లుగా అందిన విశ్వసనీయ సమాచారంతో ఎక్సైజ్ అధికారులు గురువారం కూనవరం రోడ్డులోని ఆర్టీవో కార్యాలయం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. రెండు మోటర్ సైకిళ్లపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అధికారులు ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద 15 కేజీల ఎండు గంజాయి పట్టుబడింది. దీనిని ఒడిశాలో కొన్నామని, హైదరాబాద్‌లో అమ్మేందుకు తీసుకెళ్తున్నామని ఆ ఇద్దరు వ్యక్తులు చెప్పారు.

అటవీ అధికారుల వాహనాన్ని ఢీకొట్టి.. కటకటాల్లోకి

టేకులపల్లి, జనవరి 11: అటవీ అధికారుల విధులను ఆటంకపరిచి, వారి వాహనాన్ని ట్రాక్టర్‌తో ఢీకొట్టిన డ్రైవర్.. జైలుపాలయ్యాడు. ఎస్సై గన్‌రెడ్డి రమణారెడ్డి తెలిపిన వివరాలు.. ఈ నెల 9వ తేదీ రాత్రి వేళ, మండలంలోని రాందాస్ తండా(లాల్ తండా)కు చెందిన నూనావత్ హతీరామ్, ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నాడని అటవీ అధికారులకు సమాచారం అందింది. దీంతో వారు తమ వాహనంలో పెట్రోలింగ్‌కు వెళ్లారు. ఆ ఇసుక ట్రాక్టర్‌ను గమనించి, ఆపేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ ఆ ట్రాక్టర్‌ను డ్రైవర్ హతీరామ్ ఆపలేదు. పైగా, అటవీ అధికారుల వాహనాన్ని తన ట్రాక్టర్‌తో ఢీకొట్టాడు. అతడిని అధికారులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించారు. కోర్టు రిమాండ్ విధించడంతో ఇల్లెందు సబ్ జైలుకు అతడిని తరలించారు.

కలప పట్టివేత

ఇల్లెందు రూరల్, జనవరి 11: మండలంలోని కొమరారం పంచాయతీ ఎల్లాపురం గ్రామం నుంచి బోడు, టేకులపల్లి మీదుగా బొలేరో వాహనంలో ఖమ్మానికి అక్రమంగా తరలిస్తున్న కలపను ఎఫ్‌డీవో కె.వెంకన్న బృందం గురువారం సుదిమల్ల స్టేజీ వద్ద పట్టుకుంది. ఈ కలప విలువ సూమారు రూ.రెండు లక్షలు ఉంటుందని, వాహనం సహా కలపను టింబర్ డిపోకు తరలించామని, కేసు నమోదు చేశామని ఎఫ్‌డీవో తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

సారపాక, జనవరి 11: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసిన ఘటన గురువారం మండల పరిధిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం సమీపంలో చోటుచేసుకున్నది. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడిచేసి పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.4వేల నగదు, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు. ఈ దాడిలో ఎస్సై నాగభిక్షం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాల్వంచ రూరల్, జనవరి 11 : నాగారం శివారులో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం దాడిచేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కొత్తగూడెం టాస్క్‌ఫోర్స్ అధికారులు గ్రామ శివారులో ఉన్న పేకాట స్థావరంపై దాడిచేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.7,300 నగదు, 4సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాట రాయుళ్లపై కేసు నమోదు చేసి రూరల్ పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో సీఐ సత్యనారాయణ, ఎస్సైలు ప్రవీణ్, సుమన్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

పాల్వంచ రూరల్, జనవరి 11: మతి స్థిమితంలేక బహిర్భూమికి వెళ్లి కాలువలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని ప్రభాత్‌నగర్ ఎస్టీ కాలనీలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. ఎస్టీ కాలనీకి చెందిన సోడే ఐతయ్య (32) కొంతకాలంగా మూర్ఛ వ్యాధితో బాధ పడుతున్నాడు. మానసిక స్థితి కూడా సరిగా ఉండడం లేదు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం బహిర్భూమి కోసం సమీపంలోని కిన్నెరసాని కాలువకు వెళ్లాడు. తరువాత ఎంతకీ ఇంటికి తిరిగి రాలేదు. ఐతయ్య మృతదేహాన్ని స్థానికులు గురువారం గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు పాల్వంచ రూరల్ పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సారపాక, జనవరి 11: అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను బూర్గంపహాడ్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. గోదావరి బ్రిడ్జి నుంచి ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సారపాకలో ఉదయం ఎస్సై రాజ్‌కుమార్ పట్టుకున్నారు.

నేడు గణేశ్ టెంపుల్ షాపులకు వేలం

కొత్తగూడెం టౌన్, జనవరి 11: పట్టణంలోని ఎంజీ రోడ్డులో ఉన్న శ్రీ విజయవిఘ్నేశ్వర స్వామి(గణేశ్ టెంపులు) దేవస్థానానికి సంబంధించి రెండు షాపులను అద్దెకు ఇచ్చేందుకు, వస్త్రాలు పోగు చేసుకునేందుకు సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలంపాటను శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో సులోచన తెలిపారు.

గ్యాస్ డోర్ డెలివరీ టెండర్లకు ఆహ్వానం

ఇల్లెందు రూరల్, జనవరి 11: సింగరేణి ఇల్లెందు ఏరియాలో గ్యాస్ డోర్ డెలివరీకి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జీఎం జాన్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి సూపర్ బజార్ నుంచి ఉద్యోగుల ఇళ్లకు బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ గ్యాస్ సిలిండర్లను రెండేళ్లపాటు సరఫరా చేసేందుకు యూనిట్ రేట్ పద్ధతిన టెండర్లను కోరుతున్నట్లు వివరించారు. నెలవారీగా పంపిణీ చేసిన సిలిండర్ల సంఖ్యనుబట్టి రేటు ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. టెండర్లను ఈ నెల 31 వరకు జీఎం కార్యాలయంలో స్వీకరించనున్నట్లు తెలిపారు.